# ఆడజమానా

రచయిత:

కొడవటిగంటి కుటుంబరావు

ఇది ప్రపంచచరిత్రలో అపూర్వమైన సంగతి. ఇటువంటిది ఎప్పుడూ ఎక్కడా జరిగిఉండలేదు—ఆడమళయాళమూ, ప్రమీలా రాణియొక్క స్త్రీసామ్రాజ్యమూ కూడా దీనికి చాలవు, బాగా ఆలోచించిచూస్తే. ఇది మనరాష్ట్రంలోనే, మనదేశంలోనే వచ్చిపడ్డదనుకోటానికి ఎంతమాత్రమూ వీలులేదు. ఈవిపత్తు జగత్తునంతా ఆవరించింది, ఇది—ఈ ఆడప్రభుత్వం.

నామాటలు నమ్మలేకుండా ఉన్నవారు, నేను కాస్త ఉంటే గంపెడు చేస్తున్నాననుకునేవారు, ఎవరైనా ఉన్నారా? తొందరపడకండి. ఓపికపట్టి నిదానంగా ఆలోచించండి. నాది ఎంతసూక్ష్మబుద్ధో తమకందరికీ తెలుసు కనక నేను ఆత్మశ్లాఘం చేసుకోవలసిన అవసరం కూడాలేదు, అదృష్టవశాత్తూ. సత్యాన్వేషణలో నేను ఎంత ఆరితేరిన చెయ్యినో నేనే చెప్పుకుంటేమాత్రం యేమంత బాగుంటుంది కనకా! ఇక ఇంటి ఆడవాళ్ళతో పోట్లాడి సన్యసించే మచ్చుకూడా కాను నేను. కనక నేను కేవలమూ నిజమే, అదీ నిష్పక్షపాతంగా, చెబుతున్నానని తమరు నమ్మి ఈవ్యాసం చదవాలని నాప్రార్థన.

ఇది ఆడజమానా అన్నాను. మరి మనసంఘంలో ఆడది ఎక్కిరావటానికి వీలులేకుండా చాలా ఘట్టి బందోబస్తు చేశామే—అనగా పుట్టిననాటినించీ దాసీత్వానికి తరిఫీదుచేస్తూ, అడ్డమైనవాళ్ళకు అణగిపడివుండమని ఉద్బోధించే కుమారీశతకం వగైరా గ్రంథాలే చదివిస్తూ, నిరపాయకరమైన పాతివ్రత్యం వారికి దాటరాని ఆదర్శంగా పెట్టి, స్త్రీపురుషవిచక్షణతేలేని వయసులోనే దక్షిణ (వరశుల్క) సహితంగా యేఅయ్యచేతులోనో పెట్టి, వారికి ఎటువంటిహక్కులూ—కనపడటం, వినపడటం, వోటుచెయ్యటం, ఆస్తిపంచుకోటం, జీవితాన్ని భీమా చేయించుకోటం మొదలైనవి—లేకుండాచేసి వాళ్ళకెక్కడా దాపరి

268

సలపకుండా నవరంధ్రాలూ బిగించి ఉన్నామే, సాంఘికంగాకూడా వాళ్లు ఇష్టంలేని భర్తను వదిలెయ్యటానికి వీలులేకుండా, మరోపెళ్లాడటానికి వీలులేకుండా, అదృష్టవశాత్తూ మొగుడుపోతే జుట్టుంచుకోటానికీ పూలుపెట్టుకోటానికీ రెండుపూటలా భోంచెయ్యటానికీ మంచి బట్టలు ధరించటానికీ అర్హతలేకుండాచేసి, మన మూఢవిశ్వాసాలు కూడా వాళ్ళకు అపకారంగా ఉండేట్టు చేశామే; ప్రాకృతంగాకూడా వాళ్లు నెలకు మూడునాళ్లు వాకిటఉండటం, అది తప్పించుకున్నారా, తొమ్మిదినెల్లు గర్భంమోసి ఆఖరుకు చచ్చేటంతపని అయి ప్రసవించటం జరుగుతున్నదే—ఇంత నిర్బంధంపాలయిన స్త్రీజాతి, అబలాజాతి, మనమీద ప్రభుత్వం చెయ్యటమేమిటి? తెలిసి మాట్లాడుతున్నావా! అని నన్ను తమరు ప్రశ్నించవచ్చు.

అక్కడే ఉంది తిరుగుడంతా! వాళ్ళనుచూస్తే మనకు ఏదో భయంలేకపోతే మనం ఇంత ఎందుకు చెయ్యవలసివచ్చిందీ? 'ప్రకృతి ఎట్లాగూ స్త్రీజాతిని కనికరించలేదుకదా, ఆవార మనం వాళ్ళకు సంఘంలో ఉన్నతస్థానంఇచ్చి వారికి న్యాయంచేదాం' అని మనం ఎందుకు అనుకోలేదూ? వారి అబలాత్వం మనం నమ్మలేదు, వారిశక్తి మనం ఎరుగుదుం. మగవాడిబలం సమ్మెటయొక్కబలం. ఆడదానియొక్కబలహీనత్వం విద్యుచ్ఛక్తిని మోసుకుపొయ్యేతీగల బలహీనత్వం. ఈఆడవాళ్ళుండే అట్లా నిస్సహాయులల్లే కనిపిస్తారు. ఆధారం లేకపోతే తోటకూరకాడలల్లే వేళ్లాడబడి పోతారు; వాళ్ళజోలికి పోయినామో చచ్చేషాక్ తగులుతుంది!

మళయాళస్త్రీలూ వెనకటి ప్రమీలరాణీ మొదలైనవారి ప్రభుత్వం ఒక ప్రభుత్వమా? మనల్ని చంపి మింగగల సింహానికీ మనలోపల ప్రవేశించి చంపే క్రిమికీ ఎంతభేదంఉందో అంతభేదంఉంది ప్రమీలరాణికీ మనల్ని పరిపాలిస్తున్న స్త్రీలకూ. నేను స్త్రీనైతే నాకు ప్రమీలరాణియొక్క హక్కులక్కర్లేదు. అవన్నీ ఇవ్వటంఉందే, అది ఎలెక్ట్రిక్ తీగను తెంచి కొరడాతాడు చెయ్యటమే!

ఇక ఆడవాళ్ళప్రభుత్వం మనసంఘంలో ఏవిధంగా నడుస్తున్నదో చూతాం. మొట్టమొదట మనం తెలుసుకోవలసిన విషయం ఏమిటంటే పురుషుడికి స్త్రీ గార్డియన్. స్త్రీ పురుషుడికి దాసీఅనుకోవటం పురుషుడి అవివేకం. మగవాడిమతాన్ని, ఆచారాలను, నాగరికతను పట్టుకొస్తున్నది ఆడది. చివరకు ఇలెగాడిమాతృభాషకూడా ఆవిడగారి పోషణ

లోనేడుంది—ఇతగాడు పిల్లలతోపాటు.

పురుషుడనే పక్షి పొడుగుపాటి దారంతో స్త్రీఅనే రాతికి కట్టబడిఉంది. అందుచేత ఈపక్షి ఎటు ఎగరబోయినా యీరాయే అడ్డం వచ్చి, ఎటుచూసినా కృష్ణుడే కనిపించిన కంసుడివలె అవుతుంది ఈ పోతుపక్షి. మగవాడు ఎంత గొప్పవాడయి కూర్చుంటేమాత్రం ఏం లాభం—తనభార్యయొక్క భర్త కాకుండా పోలేకపోయిన తర్వాత!... వెనక ఒకసారి నేను ఒక గొప్పవాడి భార్యను చూశాను. నాతో ఆవిడ మాట్లాడలేదు ఊరికే చూసింది—'నాభర్తను ఎరుగుదువుగదా! నావంక చూడు. నువ్వంత గౌరవంగా చూస్తున్న ఆవ్యక్తిని మెల్లి మెల్లిగా కబళించివేస్తున్నది నేనే. ఆయన ఇంటికిరాగానే చూడవలసింది నా మొహం, భోజనంచేయవలసింది నాచేతులసహాయంతో, సిగ్గుపడవలసింది నన్నుచూసి, తప్పించుకుపోలేంది నానుంచి' అన్న దామెచూపు. నేను ఎందుకో ఆమెనుచూసి భయపడ్డాను. ఆయన్నుచూస్తే జాలి వేసిందికాని వెనకటి గౌరవంపోయింది. అన్యాయమే. ఆవిడను ఆయన తనకుతానై పెళ్లాడిఉండడు—ఆయన తల్లీ వాళ్లూ చేసిఉంటారు!...

పురుషుడు డ్రీమర్—ఏకాంతంగా కూర్చుని కలలుకంటూ ఉంటాడు: 'ఈవిధంగా కాలంవెళ్ళబుచ్చుదాం, మనపిల్లలను ఈవిధంగా తయారుచేదాం...'అని. కాని తీరా చెయ్యవచ్చేటప్పటికి ప్రతిదానికీ ఆడది అడ్డంవస్తుంది—బలంచేతగాదు, ఉపాయంచేతకాదు; మనం ఊహించనైనా లేని ఒకానొక శక్తిచేత.

మగవాడిదాసీఅన్నట్టు నటిస్తూ ఆడది మగవాడిసుఖం యాచిస్తూ తన అరిచేతులలో పెట్టుకుంది. తిండిసుఖందగ్గిరనించి రతిసుఖం వరకూ పురుషుడు స్త్రీ అనుమతిమీద ఆవిడ ఇవ్వదలచిన స్వరూపంలో పొందాలి. ఒకఇల్లాలు ప్రతివంటకంలోనూ కారంవెయ్యవలసిన దానికి రెట్టింపు తక్కువకాకుండా వేస్తుంది. ఆవిడ జ్ఞాపకంవచ్చినప్పుడల్లా, 'పాపం, ఈవిడ భర్తకావాలన్నా కారంతక్కువగా తినలేడుకద! ఆయన జన్మకు కారంలేకుండా తినటంఏమిటో తెలియదుకద.' అని అనుకుంటాను, నాగుండె పగిలిపోతుంది; ఎప్పుడైనా ఒకపూట ఎవరింటికైనా భోజనానికిపోలేడనికాదు, అట్లా ఎంతకాలం జరుగుతుందీ?

ఆవిధంగానే సన్నని భార్యగలభర్తకు బొద్దుగాఉండే భార్య ఉంటే ఎట్లాఉంటుందో తెలియదుకద!

భార్య పిల్లలను రోతగాపెంచేదైతే భర్త ఏమిచెయ్యటానికీ లేదు కద!

ఇటువంటి ఇబ్బందులు భార్యలకుమాత్రం లేవా అని అడగ వచ్చును. లేవు! సన్ననిభర్తకూ లావుపాటి భర్తకూ భేదం తెలియదు సామాన్యస్త్రీకి. స్త్రీ దాదాపు ఎటువంటి భర్తతోనైనా సంసారం చెయ్యగలదని హావెలాక్ ఎలిస్ చెబుతున్నాడు. మిగతావిషయాల్లో 'చేత' అంతా ఆడదానిదేకనక 'ఫిర్యాదు' లేదు.

పురుషుడు ఎంత 'పాడిచేసిన' వాడైనాసరే ఇంటికివచ్చినతర్వాత తను చదువుకున్నదీ, తను అనుభవంమీద నేర్చుకున్నదీ తను బుద్ధికుశలతవల్ల ఊహించినదీ, అంతా మరిచిపోలేక పోయినాడో ఇంట శాంతి ఉండదు. ఇప్పటికాలపు యువకులు భార్యలతో సుఖంగా కాపరం చెయ్యలేకపోవటానికి కారణం తగినవేదాంతం లేకపోవటమే. ఆడదాని అధికారం సహించగలగటానికి మగవాడికి ఎంతవేదాంతమైనా అవసరం.

ఫెమినలిజం అనేది ఆడదానికి పరమశత్రువు. ఆమె పరిపాలన కింద మగవాడు తనమనస్సును చంపుకుని సిగ్గుమాలినవీ, అర్థంలేనివీ అనేకపనులు చెయ్యవలిసి ఉంటుంది. ఏకుర్రవాడో కొత్తగా మనస్సు వికసిస్తున్న ఉద్రేకంతో 'నేను బాజాలతోసహా కార్యంచేసుకోను, శాస్త్రోక్తంగా మైలా పురుడూ పట్టనూ, అదిచెయ్యనూ, ఇదిచెయ్యనూ' అంటుంటే వింటే నాకు నవ్వువస్తుంది. చివరకు ఆడవాళ్లుఎట్లాగో వాళ్ళయిష్టం సాధించితీరుతారు. నాస్నేహితుడొకడు పంతంకొద్దీ మైల ఇంట్లోకలిపాడు. 'అవన్నీ ఎట్లాతడుపుతారో చూస్తానూ' అన్నాడు ఇంట్లో మయిలపడదగిన వస్తువులన్నీ ముట్టుకుని. వాళ్లు వాటినన్నిటినీ తడపలేదు, నిజమే, కాని వాడివంటిమీద బట్టలుమాత్రం తడిపితీరారు. నాస్నేహితుడు వెధవమొహంపెట్టి, 'అర్థం ఏమిటి?' అన్నాడు- ఆడవాళ్ళకు అర్థంతో పనిఉన్నట్టు.

సంసారపక్షంగా అవసరంకలిగే వైద్యమూ, నీతీ, న్యాయమూ, ప్రపంచజ్ఞానమూ, శాస్త్రపురాణపరిచితీ, కళాభిజ్ఞతా ప్రతిఆడదానికీ ఉన్నది. ఒకఊళ్ళో ఒకకుర్రవాడు చెట్టుమీదినించి పడి కాళ్లు విరుచుకున్నాడు. పొరుగింటి ఆడవాళ్లు మంచివైద్యం చెప్పారు—సలసలా కాగే ఉడుకునీళ్లుపోసి రోగికి పెరుగన్నం పెట్టమన్నారు, ఆకుర్రవాడు రెండురోజుల తరవాత చచ్చాడు. ఆఉడుకునీళ్లుపోస్తుంటే వాడు పడ్డ

బాధ వర్ణనాతీతం. (నిజంగా జరిగింది. కొ.కు.) ఈఘటననుగురించి ఏవిధమైన వ్యాఖ్యానమూ జరగలేదని నేను వేరే చెప్పనక్కర్లేదు.

అదే మగవాడు ఇంటో ఆడవాళ్లు తెమ్మన్న డాక్టరును తీసుకురాకపోయినాడో మరోడాక్టరువల్ల రోగాలు నయమవుతున్నా ఇంట్లో శాంతిమాత్రం ఉండదు.

ఆడవాళ్ళకు ఇంత అధికారం ఎట్లావచ్చిందంటే సులభంగా చెప్పవచ్చును, 'సృష్టిలోనే వాళ్లు శక్తిస్వరూపిణులు' అనేసి. కాని ఆ అధికారాన్ని దక్కించుకోటానికి వాళ్ళప్రకృతి ఏవిధంగా తోడ్పడుతున్నదో తెలుసుకోవటం చాలా అవసరం.

స్త్రీకి సిగ్గులేదు. అందుకనే ఆవిడ పరభృతంగా ఉండగలదు. అందుకనే పురుషుడు తన స్త్రీదుష్ప్రవర్తనకు సిగ్గుపడ్డట్టు స్త్రీ తన పురుషుడి దుష్ప్రవర్తనకు సిగ్గుపడదుకూడా. సూక్ష్మవిచక్షణచేసేటంత నాజూకు స్త్రీకిలేదు. అందుకనే దేనితోనైనా సరిపెట్టుగోగలదు. స్త్రీ లిఖితపూర్వకంగా అధికారంకోరదు. ఆ అధికారాలు దక్కేవికావు. స్త్రీకి నిజమైన న్యాయబుద్ధి, సత్యాన్వేషణపరతా లేవు. అంతస్సాక్షీకూడాలేదు. మనల్ని ఆకర్షించేది స్త్రీలో బోలెడంత ఉండికూడా మనకు అసూయకలిగించేది స్త్రీలో ఈషణ్మాత్రంలేదు.

స్త్రీ సంఘంలో అతిహీనస్థానాన్ని ఆక్రమించటానికి అంగీకరించింది. నిరయుధురాలుగా ఉండటానికి ఒప్పుకుంది. మనకు తనతో బోలెడంత అవసరం కల్పించుకుంది. ఇవన్నీ మనల్ని మింగేస్తున్న మార్వాడీలు చేసేపనులే.

మన కీస్త్రీజులుం తప్పాలంటే ఒక్కటేమార్గంఉంది. పురుషులకు స్త్రీలతో సమానమైన హక్కులివ్వండి. స్త్రీలకి వుత్తుత్తఅధికారాల మీద భ్రమపుట్టించండి, వాళ్ళమీదిభారం తగ్గించి బాధ్యత ఎక్కువచెయ్యండి. దానితో వాళ్ళ నిరంకుశత్వం కట్టుతుంది. పాశ్చాత్య దేశాలలోలాగే మనకూ స్వాతంత్ర్యం వచ్చేస్తుంది.

చదువుకుని 'పురుషులతో సమానమైనహక్కులు' సంపాదించిన స్త్రీలను చాలామందిని చూశాను. అంతా కోరలుతీసిన త్రాచులే. నామాట నమ్మండి.